రబీ సాగు షురూ..!

- మండలంలో 6 వేల నుంచి 7 వేల ఎకరాల సాగు


రబీ సాగులో శనగ పంట వేసిన దృశ్యం


రబీ సాగుకు చదును చేసిన భూమి

ఆదిలాబాద్‌రూరల్: వానాకాలంలో సోయాబీన్ పంట సాగు చేసిన రైతన్నలు ప్రతీ ఏడాది మాదిరిగానే ఈఏడాది రబీలో శనగ, జొన్న, వేరు శనగ, తదితర పంటలు సాగు చేయనున్నారు. అలాగే వానాకాలంలో పత్తి పంట అంతంత మాత్రమే దిగుబడి వచ్చినా.. కొంత మంది రైతులు సైతం ఆ పంటను తీసి శనగ, వేరుశనగ వంటి పంటలు సాగు చేస్తారు. ఇప్పటికే సోయాబీన్ పంటను తీసిన కొంత మంది రైతన్నలు గత నెల మొదటి వారంలోనే శనగ వేశారు. మరో 15 రోజుల వరకు కూడా శనగ పంట వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

7 వేల ఎకరాల సాగు..

మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. 7 క్లస్టర్లు ఉన్నాయి. ఆయా క్లస్టర్ల పరిధిలో సుమారు 6 వేల ఎకరాల నుంచి 7 వేల ఎకరాల వరకు రబీలో శనగ పంట సాగయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పంటతో పాటు జొన్న, కూరగాయల పంట సాగు చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా శనగ పంట ప్రధానంగా నల్ల రేగడి భూముల్లో వేస్తుంటారు. ఈపంటకు ఒకటి, రెండు తడులు అవసరం ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మరో పదిహేను రోజులు..

రబీ సాగులో భాగంగా ప్రతీ ఏడాది శనగ పంటను సాగు చేస్తుంటారు. ఇప్పటికే మండలంలోని కొన్ని గ్రామాల్లో శనగ పంటను వేశారు. మరో 15 రోజుల వరకు శనగ పంటను వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. డిసెంబర్ మాసంలో వేరు శనగ పంటను వేసే అవకాశం ఉంటుంది.

ఎక్కువగా శనగ పంట

రబీ సాగులో భాగంగా గత నెల మొదటి వారం నుంచి శనగ పంట సాగు ప్రారంభమైంది. ప్రధానంగా వానాకాలంలో సోయాబీన్ పంట వేసిన రైతులు రబీలో శనగ పంట సాగు చేస్తుంటారు. రబీ సాగుకు మరో పదిహేను రోజులు గడువు ఉంది. అప్పటి వరకు వేసుకోచ్చు.

– కాటెపెల్లి నగేశ్‌రెడ్డి, వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్ రూరల్

జ్యోతిబా పూలేకు ఘన నివాళి


నార్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

నార్నూర్: మండల కేంద్రంలోని త్రిరత్న బుద్ధ విహార్‌లో గురువారం అంబేడ్కర్ అసోసియేషన్, విశాఖ మహిళా మండలి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతి కోసం ఆయన ఎంతో కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లోకండే చంద్రశేఖర్, లోకండే దేవరావు, మాజీ జెడ్పీటీసీ బిరుజులాల్, దుర్గే రుక్మిణి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తలమడుగు: సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, స్త్రీ విద్య కోసం మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. గురువారం జ్యోతిబా పూలే 134 వర్ధంతిని మండలంలోని బరంపూర్, కుచులాపూర్, లింగీ, సుంకిడి గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుజాత, గజానన్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో సీసీఐ జోరు

- గతం కంటే ఎక్కువ కొనుగోళ్లు


మాట్లాడుతున్న చైర్మన్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలో ఇప్పటివరకు పత్తి కొనుగోళ్లలో సీసీఐ అగ్రస్థానంలో నిలిచింది. మార్కెట్ పరిధిలోని ఆరు సీసీఐ కేంద్రాల్లో 1,10,279 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ప్రైవేట్ వ్యాపారస్తులు కేవలం 10,777 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. గత ఏడాది సమాయానికి సీసీఐ కేవలం 1716 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారస్తులు 13,667 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. గత ఏడాది ఈ సమయానికి 15,383 క్వింటాళ్ల పత్తిని సీసీఐ, ప్రైవేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేయగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 1,21,056 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. కాగా.. ఈనెల 22 వరకు పత్తి విక్రయించిన వారి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. ఈనెల 27 వరకు బోథ్, నేరడిగొండ మండలాల్లో 2143 మంది రైతుల నుంచి 35,760 క్వింటాళ్ల సోయాపంటను పీఏసీఎస్ ద్వారా మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలి


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

నేరడిగొండ: జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుజరాత్ తరహాలో అంగన్‌వాడీలను 3, 4 నాలుగు తరగతి ఉద్యోగులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించాలని పేర్కొన్నారు. అంతవరకు టీచర్లకు గౌరవ వేతనం రూ.26 వేలు, ఆయాలకు రూ.13 వేలు అందించాలన్నారు. డిసెంబర్ 9 నుంచి జరిగే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను ప్రస్తావించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఎదులాపురం: సీపీఐ ఆవిర్భావ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సీపీఐ పార్టీకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు. స్వాతంత్ర్యానికి ముందే పార్టీ ఏర్పడిందని గుర్తుచేశారు. ప్రజా, కార్మిక సమస్యలపై సీపీఐ తనదైన రీతిలో పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంటాల రాములు, అరుణ్‌కుమార్, నర్సింగ్, రమేశ్ పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడాలి

ఆదిలాబాద్‌టౌన్: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని న్యూ రెయిన్‌బో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రాము అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. బాల్య వివాహాలు, బేటీ బచావో.. బేటీ పఢావో, విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుతోనే ఉన్నతస్థాయికి ఎదుగుతారని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మీనాక్షి, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బేల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం నూతన ఎస్సైగా దివ్యభారతి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై రాధిక తాంసి మండలానికి బదిలీ కావడంతో, ఆమె స్థానంలో తలమడుగు మండలం నుంచి బదిలీపై వచ్చిన ఎస్సై బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్సై కనకే జీవన్, లింగన్న, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కానిస్టేబుళ్లు సంతోష్, అడెల్లు, ఇస్మాయిల్, రాందాస్ పాల్గొన్నారు.

రేపు అమిస్తాపూర్‌లో రైతు పండుగ


మాట్లాడుతున్న మార్కెటింగ్ ఏడీ గజానంద్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలోని అమిస్తాపూర్‌లో రైతు పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని మార్కెటింగ్ ఏడీ గజానంద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్కెటింగ్ మాట్లాడారు. అక్కడ వ్యవసాయ ప్రదర్శనలు, రైతు పండుగ మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పల్లెల అభివృద్ధి


గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న గంగారెడ్డి

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో రూ. 4 లక్షలతో నిర్మించే గ్రావెల్ రోడ్డు పనులను బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సహకారంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు తీసుకువస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల రమేశ్, టౌన్ ప్రెసిడెంట్ అనిల్, అంకుష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చెడు వ్యసనంతో భవిష్యత్ నాశనం అవుతుందని, పొగాకు ఉత్పత్తుల ద్వారా క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకుతాయన్నారు. పరీక్షలు మాత్రమే విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించవని, వారి నడవడిక, ఆత్మవిశ్వాసం అనుకున్నది సాధించేలా చేస్తుందని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ (వైడూర్యపురం) గ్రామంలో గురువారం నిర్వహించిన వైడూర్యపురం కబడ్డీ పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఆయన వారితో కలిసి కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు దేవేందర్ రెడ్డి, నానక్ సింగ్, సురేందర్, బాబులాల్, వడూర్ గ్రామ నాయకులు, ఉప్పు పోశెట్టి, పాల శంకర్, శ్రీకాంత్, ఉషన్న పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఉపసర్పంచ్ లోకేశిరిష్ రెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గాడ్గే సూభాష్, నర్వడే రమేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్ రెడ్డి, సువర్ణమాధవ్, బత్తుల అశోక్ పాల్గొన్నారు.

సొనాలలో గ్రామస్తుల సంబురాలు


సంబురాలు జరుపుకుంటున్న గ్రామస్తులు

బోథ్: మండలంగా సొనాల ఏర్పాటు కావడం, మండల ప్రజా పరిషత్‌గా జీవో రావడంతో సొనాల వాసులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. గ్రామస్తులు, నాయకులు, యువకులు హనుమాన్ ఆలయం నుంచి డప్పుచప్పుళ్లతో బస్టాండ్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి, కుమురం భీం, వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల బాటలో తాము సొనాలను మండలంగా సాధించుకున్నామన్నారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించుకున్నారు. ప్రభుత్వం సొనాలలో వెంటనే కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీ దహనం

కైలాస్‌నగర్: ప్రజాపాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగజారి వ్యాఖ్యలు చేయడం శోచనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజా సేవాభవన్ ఆవరణలో మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలను దహనం చేశారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. దిలావర్‌పూర్ ఇథనాల్ ఫ్యాక్టరీ ఘటనలో వెనకుండి ప్రజలను రెచ్చగొడుతూ శాంతి భద్రతల సమస్య తలెత్తేలా చేస్తున్నాడని ఆరోపించారు. సీఎంను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, సంతోష్ రావు, నగేశ్, వసంత్, విట్టల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ పాఠశాలలో స్పోర్ట్స్‌మీట్ క్రీడలను జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు విద్యార్థులు డీఎస్పీకి ఘన స్వాగతం పలికారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. భవిష్యత్‌లో క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలుగుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సెమీ, కరస్పాండెంట్ ఫదర్ వినోద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను సత్వరమే స్వీకరించాలన్నారు. కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సై అంజమ్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

'పుకార్లు నమ్మవద్దు'

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం రాముగూడ గ్రామస్తులు పులి సంచరిస్తున్నట్లు పాదాల గుర్తులు ఉన్నాయని అటవీ శాఖ అధికారులకు గురువారం సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఇంద్రవెల్లి ఎఫ్ఆర్‌వో సంతోశ్, పులిమడుగు ఎస్ఎస్‌వో చంద్రరెడ్డి, బీట్ అధికారి పద్మజలు గ్రామానికి వెళ్లి పాదాల గుర్తులను పరిశీలించారు. ఇతర జంతువు పాదాలుగా గుర్తించి కుమ్మరితాండ, యేంద ప్రజలకు అవగాహన కల్పించారు. పుకార్లను నమ్మవద్దని అటవీ శాఖ అధికారులు సూచించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన, గిరిజనేతర రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. గురువారం స్థానిక ప్రజాసంఘాలు, రైతుల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి ఉట్నూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. నాయకుడు భరత్ చౌహాన్, బానోత్ రామారావు మాట్లాడుతూ.. దశాబ్దాల కాలం నుంచి గిరిజనులతో పాటు గిరిజనేతరులు భూములు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తారని అందరికీ సమాన హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గిరిజనేతరులు పహాణీల ద్వారా లోన్లు తీసుకోవడం జరిగిందని వారికి రుణాలు ఇప్పటికీ మాఫీ కాలేదన్నారు. రైతులందరికీ రైతుబంధు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి, రైతులు ఉన్నారు.

సన్మానం

నార్నూర్: గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామానికి చెందిన అత్రం అరవింద్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి శిక్షణ పూర్తి చేసుకోవడంతో గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మెస్రం శేఖర్ బాబు, కుమ్రా సోనేరావు, బీర్ షావ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

బడుల సమయం మార్చాలని వినతి

కైలాస్‌నగర్: జిల్లాను చలిపులి వణిస్తున్నందున పాఠశాలల ప్రారంభ సమయాన్ని మార్చాలని యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్యాలయాల కోసం భవనాల పరిశీలన

బోథ్: సొనాల మండలం ఏర్పాటైన నేపథ్యంలో మండలంలో కార్యాలయాల ఏర్పాటు కోసం గ్రామస్తులు గురువారం పలు భవనాలను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని పలు గదులను కార్యాలయాల కోసం పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్ధాన్ సమాజ్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు సిడాం రాంకిషన్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్ధాన్ సమాజాన్ని ప్రభుత్వం పీటీజీగా గుర్తించాలని, వందశాతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. నాయకులు శంకర్, వనిత, ప్రకాశ్, జనార్ధన్, ప్రదీప్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

ఆదిలాబాద్‌టౌన్: ధ్యానంతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని కన్హా ఆశ్రమ ప్రతినిధి పెట్రా అన్నారు. రిమ్స్ ఆడిటోరియంలో వైద్యుడు సందీప్ జాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల ధ్యానోత్సవానికి హాజరయ్యారు. ధ్యానం ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. రిమ్స్ వైద్యులు, పట్టణ వైద్యులు, మెడికోలు, జోనల్ కోఆర్డినేటర్ షరీఫ్, మధు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ కార్గో సేవలు

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వరకు కార్గో సేవలు అందించడం జరుగుతుందని ఆదిలాబాద్ కార్గో మేనేజర్ బి.పాల్, సేల్స్ టీం లీడర్ సాయన్నలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కార్గో సెంటర్‌ను సందర్శించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ

నార్నూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ వద్ద గురువారం మాల మహానాడు ఆధ్వర్యంలో సింహగర్జన, చలో హైదరాబాద్ పోస్టర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొప్పుల రమేశ్, మోటు ప్రహ్లాద్, మోట్టె కిరణ్ కుమార్, పాశం రాఘవేంద్ర, లోకండే చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ బ్రిజిలాల్, సునీల్ పాల్గొన్నారు.

తలమడుగు: డిసెంబర్ 1న హైదరాబాద్ నిర్వహించే సింహగర్జన మహాసభను విజయవంతం చేయాలని మండల మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్ కోరారు. గురువారం మండలంలోని కొత్తూరు, లింగి గ్రామాల్లో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు, రాజేశ్వర్, ప్రకాష్, నడ్పి పోచ్చన్న, ఐండ్ల దశరథ్, జంగళ పోచ్చన్న, రమేశ్, కనిత్కర్, బొచ్చన్న పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సావర్గాం గ్రామానికి చెందిన మద్దెల లస్మన్నకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.60 వేల చెక్కు అందించారు.

గిరి వికాసం నిధులు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గిరి వికాసం పథకం కింద మంజూరైన బోరు బావులకు నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కొట్నాక్ తిరుపతిని హైదరాబాదులోని సంక్షేమ భవన్‌లోని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పథకం వల్ల వందలాది మంది గిరిజనులు ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండు పంటలు పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. నిధులు పెండింగ్‌లో ఉన్నాయని వాటి మంజూరుకు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమరం కోటేశ్వర్, మడావి భీమ్ రావు, మెస్రం రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని హమీద్‌పుర ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, రికార్డులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరును పరిశీలించారు.

దుప్పట్లు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అనంతపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీలకు గురువారం పోలీసు శాఖ స్థానిక ఎస్సై దుబ్బక సునీల్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. పోలీసులు మీ కోసం ఉన్నారని, గ్రామాల్లో సమస్య వచ్చిన పరిష్కరిస్తామన్నారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు పాల్గొన్నారు.

నేడు గణిత పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం మండల, జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం దిలీప్ రెడ్డి, పిల్లి కిషన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగుల హక్కులు కాపాడేందుకు కృషి

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగుల సమస్యలతో పాటు వారి హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. ఇటీవల సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఏఈవోల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి, ఏవోలు విశ్వమిత్ర, శ్యామ్‌సుందర్, విశ్వనాథ్, రాంజైపాల్, శ్రీధర్, రమేశ్, సంతోష్, భోజన్న, స్రవంతి పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన సూర వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయం వ్యవస్థపకులు దుర్వ సంతోష్ బాధిత కుటుంబానికి గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సభ్యులు రాజు, నానిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి

ఉట్నూర్‌రూరల్: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవనంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలపరిచిన అభ్యరిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

స్త్రీలను గౌరవించాలి

ఆదిలాబాద్‌టౌన్: స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయమని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా సఖీ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, మహిళా శిశు అభివృద్ధి, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని భీంపూర్ కేజీబీవీ, మావల కేజీబీవీ పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, కేజీబీవీ ప్రత్యేకాధికారులు రజిని, సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం'

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన స్ఫూర్తితోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రావుత్ మనోహర్, ఇజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేశ్, సాజిదొద్దీన్, యూనుస్ అక్బాని, నర్సింగ్ రావు, అడప తిరుపతి, దాసరి రమేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

సిరికొండ: విద్యార్థులు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో ఫణీంధర్, తహసీల్దార్ తుకారం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ, ప్రాథమిక పాఠశాల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతీరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం, పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.